www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 30 జులై 2025



ఘనంగా విక్రమ్ జన్మదిన వేడుక

ప్రజాశక్తి - రాజోలు


కేక్ కట్ చేస్తున్న మంత్రి సుభాష్

టిడిపి రాజోలు యువ నాయకుడు గుబ్బల విక్రమ్ పుట్టినరోజు వేడుకను మంగళవారం మలికిపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న విక్రమ్‌ను మంత్రి అభినందించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, టిడిపి నాయకులు అంబికా లక్ష్మణ్, యువ నాయకులు దొంగ శ్రీను పాల్గొన్నారు .

అందని తల్లికి వందనం

-నిబంధనలతో అర్హులకు ఎగనామం
-అరాకొర వేతనదారులకు తప్పన కోతలు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలుకు పలు నిబంధనలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అధికార పగ్గాలు చేపట్టిన ఏడాది తరువాత అమలు చేసిన తల్లికి వందనం పథకంలో అర్హులకు సైతం ఎగనామం పెట్టేలా ప్రభుత్వం నిబంధనలను తెరపైకి తెచ్చింది. అధికారం కోసం తల్లులందరికి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం రూ.15వేలు చొప్పున ఇస్తామని ఇచ్చిన హామీ కొందరికే అన్నట్లుగా నిబంధనలు రూపొందించింది. దీంతో అర్హులైన వారు సైతం అనర్హులుగా మారిపోయారు.

మండలంలో 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, 64 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ప్రయివేటు ప్రాథమికోన్నత పాఠశాలలు, 4 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 8,500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వీరిలో 7,626 మంది విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకంలో అర్హులుగా భావించి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదును బదిలీ అయింది. ఇందులో కొందరి బ్యాంకు ఖాతాలకు రూ.13 వేలు పడితే, మరికొందరికి రూ.7 వేలు, రూ.10 వేలు ఇలా జమ చేశారు. ప్రభుత్వం ఇస్తామన్నా రూ.15 వేలలో ప్రభుత్వమే రూ.2 వేలకు కోత పెట్టింది. అయితే కొందరు ఎస్‌సి, బిసి విద్యార్థుల


ముగ్గురు మనవళ్లతో పాత ఇంజరంకు చెందిన కుంచే అప్పాయమ్మ

తల్లుల ఖాతాలకు రూ.7 వేలు, రూ.10 వేలు చొప్పున పడటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకుంది. ఇందులో 877 మందికి తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. వారంతా నేటికీ ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అనర్హులుగా గుర్తించబడిన వారిలో అధిక శాతం అంగన్‌వాడీ, ఆశ, పారిశుధ్య కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలే ఉన్నారు. పైగా ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు మరికొందరు ఈ పథకానికి అనర్హులుగా గుర్తించబడ్డారు. ఏడాదిలో ఏ నెలలోనైనా 300 యూనిట్లు పైబడి కరంటు బిల్లు వచ్చినా, 3 ఎకరాలు మాగాణి, 10ఎకరాలు మెట్ట పొలం, నాలుగు చక్రాల వాహనం, గతంలో ఎప్పుడైనా ఇన్ కామ్ టాక్స్ కట్టినా, వెయ్యి చదరపు అడుగులకు పై బడి విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకున్నా ఈ పథకానికి అనర్హులుగా ప్రభుత్వం మారిపోయారు. ఆ నిబంధనలు పక్కన పెడితే సాంకేతిక కారణాలతో పలువురు ఈ పథకానికి నోచుకోకుండా పోయారు. పాతఇంజరం గ్రామంలో కుంచే అప్పాయమ్మ తన ముగ్గురు మనవళ్లతో జీవనం సాగిస్తోంది. చిన్నప్పుడే తన కోడలు మృతి చెందడంతో ఆమె ఆ ముగ్గురిని సాకుతోంది. ఆమె మనవళ్లు కుంచే సానియా నిహని 3వ తరగతి, కుంచే రిజో 5వ తరగతి, కుంచే శ్రవతి తేజ 7వ తరగతి చదువుతున్నారు. అర్హతలు ఉండి కూడా తల్లికి వందనం పడలేదని సచివాలయానికి వెళితే సాకేతికకారణాల వల్ల పడలేదని చెబుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఐ.పోలవరంలో గుర్రాల అనంతలక్ష్మి అనే మహిళకు నిహారిక, మీరారోహిత్ ప్రభుత్వ స్కూల్‌లో చదువుతున్నారు. ఈ ఇద్దరికి తల్లికి వందనం పడలేదని ఆవేదన చెందారు. అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాలతో ఏర్పడిన సాంకేతిక కారణాలతో కొందరు, ప్రభుత్వం విధించిన నిబంధనలతో మొత్తంగా మండలంలో సుమారు 877 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యారు. ఎన్నికల సందర్భంగా హామీకి అనుగుణంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాకు న్యాయం జరగలేదు

కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను, గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం వచ్చింది .ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనం నా ముగ్గురు మనవళ్లకు ఇవ్వలేదు. సచివాలయంలో అడిగితే సరియైన సమాధానం చెప్పడం లేదు. ఉన్నతాధికారులు కల్పించుకుని న్యాయం చేయాలి.

-కుంచే అప్పాయమ్మ, పాతఇంజరం

పథకాలు వర్తింపచేయాలి



అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం పథకం వర్తించలేదు. సచివాలయ సిబ్బందిని సంప్రదించగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నావు అని అన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి వర్తింపచేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగింది. ప్రభుత్వ పథకాలను అంగన్‌వాడీలకు అమలు చేయాలి.

-గుర్రాల అనంతలక్ష్మి, ఐ.పోలవరం

తల్లికి వందనం ఇవ్వాలి



గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేశారు. ఆ సందర్భంలో కూటమి పార్టీల నేతలు అంగన్‌వాడీలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కావున అంగన్‌వాడీ, ఆశ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ పథకాలకు వర్తింపచేయాలి.

-జి.దుర్గాప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పౌష్టికాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్య ఆరోగ్య సిబ్బంది తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం మండలంలోని అచ్యుతాపురం పిహెచ్‌సి పరిధిలోని కాలేరు, వడ్లమూరు, నల్లూరు, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వైద్యాధికారుల పర్యవేక్షణలో ఆర్‌బిఎస్‌కె కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు, ఆరోగ్య స్థితిని పరిశీలించి తగు సూచనలు చేశారు. పౌష్టికాహారం లోపం లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ సిహెచ్.గోపాలకృష్ణ, ఎల్ఎంహెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికం రాష్ట్ర ఉపాధ్యాక్షులు కారెం వెంకటేశ్వరరావు

ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

-ఆగస్టు 5న జరిగే ధర్నాలో పాల్గొనాలని ప్రజలకు పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

బలవంతంగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, ఎఐటియుసి నాయకులు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎఐటియుసి బాధ్యులు కె.సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 9 సార్లు కరెంటు ఛార్జీలు పెంచి, రూ.32 వేల కోట్లు ప్రజల పై భారం వేసిందని అన్నారు. ఇక బాదుడు ఉండదని చెప్పి టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చాయని తెలిపారు. ప్రతి పక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగల కొట్టండని టిడిపి నేత లోకేష్, కూటమి నేతలు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను తప్పి నమ్మక ద్రోహం చేసుందన్నారు. ఏడాది కాలంలో కరెంట్ బిల్లులు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నా, ఛార్జీలు పెంచలేదంటూ మోసం చేస్తున్నారని అన్నారు. అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుంచి సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. 2014 నుంచి 2019 వరకు వాడుకున్న కరెంటుకు మళ్లీ అదనంగా రూ.3 వేలకోట్లు ట్రూఅప్ ఛార్జీలు గత 36 నెలల నుంచి వసూలు చేస్తున్నదని విమర్శించారు. ఈ ఏడాదిలోనే రూ.2,787 కోట్లు అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేశారని అన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవటానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని అన్నారు. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి, కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నదని, ఇది మీటర్ మార్పు మాత్రమే కాదని, విధానం మార్పుని అన్నారు. విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరణకు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమేనని విమర్శించారు. సెల్ ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి కరెంటును రీఛార్జ్ చేయించుకోవాల్సి వస్తాదని అన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద జరిగుప ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశానికి సిఐటియు, ఎఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం తదితర ప్రజాసంఘాల నాయకులు పీతల రామచంద్రరావు, నిమ్మకాయల శ్రీనివాసరావు, కె.భాస్కరరావు, జి.రమణ, ఊటాల వెంకటేశ్, పి.మురళీకృష్ణ, జి.సత్యం, కె.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

జాబ్ మేళాలో 92 మంది ఎంపిక

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు 12 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 229 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 92 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక యినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజక వర్గంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రతివారం క్రమం తప్పకుండా జాబ్ మేళా నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాను ఏర్పాటు చేసిన మోడరన్ విద్యా సంస్థ అధినేత డాక్టర్ లయిన్ జివి.రావును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జివి. రావు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగజేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆశ యానికి అనుగుణంగా యువత నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, నారపరెడ్డి బలరాం, మోడరన్ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, మోడరన్ డిగ్రీ కాలేజీ ప్లేస్ మెంట్ ఆఫీసర్ జి.మాణిక్యం, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత మచ్చా నాగయ్య మృతి

ప్రజాశక్తి- అయినవిల్లి, అమలాపురం

అయినవిల్లి మండలానికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మచ్చా నాగయ్య(62) మంగళవారం మృతి చెందారు. అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. అనంతరం గ్రామంలో అంత్య క్రియలు నిర్వహించారు. నాగయ్య 1963లో మండలంలోని అయినవిల్లి లంక గ్రామంలో జన్మించారు. ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యను అభ్యసించారు. 1974 నుంచి విద్యార్థి సంఘం నాయకుని ప్రస్థానం ప్రారంభించిన ఆయన పలు ప్రజా, కార్మిక సంఘాల్లో పనిచేశారు. ప్రజా ఉద్యమాల్లో మచ్చలేని నాయకునిగా పేరు సంపాదించారు.

పలువురు సంతాపం

అమలాపురం సిఐటియు కార్యాలయంలో నాగయ్యకు సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఇతర ప్రజాసంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పలువురు నాయకులు విచారం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు శెట్టిబత్తుల తులసీరావు, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ,, పిడిఎస్‌యు రాష్ట్ర


అమలాపురంలో మచ్చా నాగయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు(ఇన్‌సెట్లో మచ్చా నాగయ్య)

ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లెల్ల మనోహర్, అమలదాసు బాబూరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఏడిద రాజేష్, ఎ.రవి, నామాని శ్రీధర్, ముత్యాల శ్రీనివాసరావు, పవన్ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండా దుర్గారావు సరేళ్ల దాసు రాష్ట్ర నాయకులు ధీపాటి శివప్రసాద్, దళిత సేన అధ్యక్షులు మెండి డేవిడ్ అంబేద్కర్, సర్పంచ్ కుమ్మరి మాధవి వెంకటరమణ టిడిపి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్‌జోగేష్, టిడిపి మండల అధ్యక్షుడు శ్యామ్, ఆర్‌టిసి యూనియన్ నాయకులు నారాయణ తదితరులు నాగయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులిర్పంచారు.

బాలికపై లైంగిక దాడి దారుణం

ప్రజాశక్తి - అమలాపురం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయవరం మండలం మాచవరం గ్రామంలోని మార్గదర్శి కాన్వెంట్ కరస్పాండెంట్ జయరాజ్ అదే స్కూల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక దాడి దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ మండిపడ్డారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన మార్గదర్శి కాన్వెంట్ కరస్పాండెంట్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాన్వెంట్‌ను సీజ్ చేసి అక్కడ చదువుతున్న విద్యార్థుల ఇష్ట ప్రకారం తగు కాన్వెంట్లో చదువు కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు స్కూల్స్, కాలేజీలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా అయ్యప్ప

ప్రజాశక్తి - మండపేట


యర్రగుంట అయ్యప్ప

వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా మండపేటకు చెందిన యర్రగుంట అయ్యప్ప మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చుతానని, వచ్చే ఎన్నికల్లో మండపేట ఎంఎల్ఎగా తోట త్రిమూర్తులు విజయానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - రాజోలు

మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్ఎ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మలికిపురం మండలం లక్కవరం జిఎస్ గార్డెన్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 33 మత్స్యకార సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు, మత్స్యకార నాయకులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎంఎల్ఎ మాట్లాడుతూ పిఎం మత్స్య సంపద యోజనలో భాగంగా ప్రాథమిక మత్స్య సహకార సంఘాలను ఫిష్ ఫార్మర్స్ ఉత్పత్తిదారుల సంస్థగా మార్చినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మత్స్య సహకార సంఘాల్లోని 20 వేల మంది మత్స్యకారులకు ఈ పథకంలో లబ్ధి చేకూరుతుందన్నారు. మత్స్య సహకార సంఘాల బలోపేతానికి తోడ్పడే అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డెల్టా ఛైర్మన్ గుబ్బల శ్రీనువాస్, మత్స్య శాఖ జిల్లా అధికారి ఎల్‌బి.సిద్ధార్థ వర్ధన్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు సిహెచ్.గోపాలకృష్ణ, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, జనసేన రాష్ట్ర నాయకులు దిరిశాల బాలాజీ, మలికిపురం జడ్‌పిటిసి బళ్ల ప్రసన్నకుమారి, చాగంటి స్వామి, బర్రె శ్రీను పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్


దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - కాట్రేనికోన


మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

మండలంలోని పల్లంకుర్రు పిహెచ్‌సి పరిధిలోని కందికుప్ప గ్రామ పంచాయతీ శివారు జమ్మి చెరువులో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ నాగేంద్రరావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో మలేరియా దోమలు ప్రభలకుండా జాగ్రతలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - అమలాపురం

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మంగళవారం సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 'స్పేస్ స్కిల్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అంటే సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఒకటే కాదని, సాంకేతిక విజ్ఞానం ద్వారా అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీకి పెరుగుతున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. సైన్స్ విజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేసేందుకు సైన్స్ సిటీ సిఇఒ వెంకటేశ్వర్లు చేస్తున్న కృషిని అభినందించారు. అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఆకాంక్షలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యా యులు కృషి చేయాలని కోరారు. ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానానికి ప్రస్తుతం పెరిగిన ప్రాధాన్యతను వివరించారు. రాజకీయాలకు అతీతంగా అమలాపురం అభివృద్ధికి ఎంఎల్ఎ ఆనందరావు చేస్తున్న కృషిని అభినందించారు. సైన్స్ సిటీ సిఇఒ ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సర్వశిక్షాభియాన్- ముస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచి సాంకేతిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సిటీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సర్వ శిక్షాభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మమ్మీ, ముస్కాన్ సిఇఒ ప్రణేష్ దేబ్‌నాథ్, పాఠశాల హెచ్ఎం భమిడిపాటి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ సంసాని బుల్లినాని, పిఎసిఎస్ అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆనందరావు


ఛైర్మన్లు, డైరెక్టర్లను సత్కరిస్తున్న ఎస్‌సి నాయకులు

పలువురికి అభినందన సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన వివిధ పదవులను దక్కించుకున్న పలువురిని ఎస్‌సి నాయకులు సత్కరించారు. మంగళవారం స్థానిక ఎఫ్ఎల్‌సిఎస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిఎసిఎస్ ఛైర్మన్ మేడపాటి రామారెడ్డి, శివాలయం ట్రస్ట్ ఛైర్మన్ దమ్ము సత్యనారాయణ, ఎఎంసి డైరెక్టర్లు నామాల సూరిబాబు, చింతలపూడి శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు రేలంగి కొండయ్య, యాళ్ళ చంద్రశేఖర్‌లకు పూలమాలలు వేసి, దుస్సాలువాలు కప్పి సత్కరించారు. అలాగే రైతుల అభ్యున్నతికి, ఆలయాల పటిష్టతకు ఆయా ఛైర్మన్లు, డైరెక్టర్లు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. తమపై నమ్మకం ఉంచి ఛైర్మన్లుగా, డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాసరావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, భావన శ్రీనివాస్, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేరూరు సచివాలయ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్


సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్

వివిధ గ్రామాలకు బదిలీపై వెళ్లిన పేరూరు గ్రామ సచివాలయాల సిబ్బందికి మంగళవారం సర్పంచ్ దాసరి అరుణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, పాలకవర్గ సభ్యులు తిక్క సరస్వతి, చొల్లంగి సుజాత, కురసాల వీరబాబు, దూలం బుజ్జి, డేగల వెంకటరమణ, గ్రామ పెద్దలు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

విద్యా బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఇఒ కె.తాతారావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని తాతపూడి ప్రాథమిక పాఠశాల మెయిన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణ, విద్యార్థుల విద్యాబోధన, పాఠశాల పరిస్థితులు, తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - నిడదవోలు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని నిడదవోలు పోలీసులు కాపాడారు. నిడదవోలుకు చెందిన 25 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకుంటానని మంగళవారం నిడదవోలులో రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాడు. దీన్ని గమనించిన ఒక వ్యక్తి 112 కాల్ ద్వారా జిల్లా పోలీసుకు సమాచారం అందించారు. ఎస్‌పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు నిడదవోలు ఇన్‌స్పెక్టర్ వెంటనే స్పందించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్, సిబ్బంది ఘటనా స్థలానికి పంపించారు. వారు వెంటనే సదరు వ్యక్తిని గుర్తించి ఆత్మహత్య ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. అతని బంధువులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా నిడదవోలు పోలీసులను, కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని పటవల పైడా కళాశాల సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. యానాం సావిత్రి నగర్‌కు చెందిన చింతా శ్రీనివాస్(36) ద్విచక్ర వాహనంపై కాకినాడ వెళుతుండగా పైడా కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాస్ మృతితో భార్య కన్నీరుమున్నీరైంది. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలికలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తప్పిపోయిన ఎస్.అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలను పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎస్.అచ్యుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు ఈ నెల 28 నుంచి కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. బాలికల వద్దగల సెల్ ఫోన్ సిగ్నల్స్, సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా బాలికలు అమలాపురం వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. అమలాపురం పోలీసుల సహకారంతో తప్పిపోయిన బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ సిఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఘనంగా సర్పంచ్ లావణ్య పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య పుట్టినరోజు వేడుక స్థానిక భవ్య స్కూల్లోను, స్థానిక పంచాయతీలోను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచాయతీలో సిబ్బంది ఏర్పాటు చేసిన కేకును సర్పంచ్ లావణ్య కట్ చేశారు. సిబ్బందికి సర్పంచ్ లావణ్య స్వీట్లు, కేకు పంపిణీ చేశారు. అలాగే భవ్య స్కూల్‌లో విద్యార్థుల కేరింతల మధ్య ఆమె కేకు కట్ చేసి అందరికీ పంచారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేసి, ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.మోక్షాంజలి, గుమస్తా కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎంఎల్ఎ, వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని గోదావరి మధ్యమ డెల్టా డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక మండ నూరు వెంకటరాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్ వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు కుసంపూడి బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపిపి లక్ష్మీ ఆనంద్ నాగదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మహేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, తహశీల్దార్ బియం మహేశ్వరరావు, సిడిపిఒ ఎ.గుబ్బక్క, ఎంఇఒ బి.శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ జబీరాబు, మండల పరిషత్ ఎఒ మంగతాయారు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేగాయమ్మ పేటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఐ.నాగమునార్ పాల్గొని మాట్లాడారు. రైతులు అందరు తప్పనిసరిగా ఎరువులు వాడకం తగ్గించాలని, రైతుకు ఉన్న పొలంలో 20 సెంట్లు భూమిని ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. అవసరం మేరకు పురుగు మందులు వాడాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బివిఆర్.మణిదీప్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని, క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఆగస్టు 15వ తేదీలోపు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి - అమలాపురం

అయినవిల్లి మండలం వెలవలపల్లికి చెందిన దళిత యువకుడు దోనిపాటి మహేష్‌పై ఇటీవల జరిగిన హత్యాయత్నంపై మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన వ్యాఖ్యలు దారుణమని సిపిఎం, బిఎస్‌పి పార్టీ, కెవిపిఎస్, దళిత సంఘాలు అన్నారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలో దళిత నాయకులు బొంతు రమణ మాట్లాడుతూ మహేష్‌పై దాడి చేసిన ఘటనకు సంబంధించి నమోదైన కేసును విచారిస్తున్న డిఎస్‌పి ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు చేసింది దోనిపాటి మహేష్ కాదని ప్రకటించారని అన్నారు. అయితే ఈ కేసులో మంత్రి అనుచరులు ఉండటంతో ఎలాగైనా కేసును తప్పుదోవ పట్టించాలని మంత్రి సుభాష్ చూస్తున్నారని విమర్శించారు. బాధితుడిని ఇప్పటి వరకు కనీసం పరామర్శించిన పరిస్థితి లేదన్నారు. అయితే బాధితుడైన మహేష్ ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు చేశాడంటూ సోమవారం రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ మాట్లాడడం దారుణమన్నారు. బాధితుడిని నిందితుడుగా చిత్రీకరించి కేసును తప్పు దోవపట్టించేలా మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాధితులకు మంత్రి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఉద్యోగాల పేరుతో దళారుల చేతిలో మోసపోయిన పలువురు బాధితులకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచారు. ఇటీవల అమలాపురంలో మహేష్ అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగులు దగ్గర లక్షల్లో సొమ్మును వసూలు చేసి మోసం చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించిన బాధితులు దళిత నాయకులు రవ్వా భూషణం ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను రామచంద్రపురంలో కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి సమస్యలు సావధానంగా విన్న మంత్రి సుభాష్ తక్షణం స్పందిస్తూ దీనస్థితిలో ఉన్న ఇద్దరు మహిళా బాధితులకు తక్షణసాయంగా రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మిగిలిన సొమ్ము కూడా రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటానని, మోసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మోసపోయిన బాధితులకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధి కల్పిస్తామని అన్నారు.


బాధితులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న మంత్రి సుభాష్

'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి - యంత్రాంగం

రామచంద్రపురం కె.గంగవరం మండలం కుందూరు సావరం, కుందూరు లంక, దంగేరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి, వైసిపి మండల అధ్యక్షులు పెట్టా శ్రీనివాస్, నాయకులు పంపన సత్యానందం, చిట్టూరి శ్రీనివాస్, దారా సత్యనారాయణ, చిట్టూరి భద్రం, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొత్తపేట** కొత్తపేటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం వైసిపి మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సిరిపురపు శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అముడా మాజీ ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజ్, ఎంపిపి మార్గన గంగాధర్‌రావు, జడ్‌పిటిసి గూడపాటి రమాదేవి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని ఉప్పలగుప్తం ,ఎస్.కొత్తపల్లి, వానపల్లిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలను నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి గెడ్డం సంపదరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, బొడ్డు బుజ్జి, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల నియామకం

ప్రజాశక్తి - కొత్తపేట

నియోజకవర్గంలో బూత్ లెవిల్ అధికారులను నియమించినట్లు ఆర్‌డిఒ పి.శ్రీకర్ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ కొత్తగా బూత్ లెవెల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎస్ఎస్ఆర్-2025 ప్రకారం మొత్తం ఓటర్లు 2,52,581 ఉన్నారని వివరించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు(బిఎల్ఎ)లు అందరూ వారి పిఎస్‌లలో క్లైమ్స్ నుంచి 6, 7, 8 ల యొక్క వివరాలను తెలుసుకుని వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే బిఎల్‌ఒలకు తెలియచేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు మంత్రి సుభాష్ అందజేశారు. నియోజకవర్గంలో 31 మంది నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.29 లక్షల 61 వేల 567 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయ నిధి అనేది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక నిధి అని, నిరుపేదలకు, ప్రకృతి వైపరీత్యాల బాధితులను ఆదుకునేందుకు ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలు, ఎన్‌టిఆర్ వైద్య సేవ పరిధిలో లేని చికిత్సలు అవసరమైనవారు ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు ప్రజా ప్రతినిధుల సిఫార్సుతో ఈ ఆర్థిక సహాయంను పొందచ్చునని అన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న వాటర్ ట్యాంకుల నిర్మాణాల్లో తపనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపిడిఒ ఎ.రాజు ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుమ్మిలేరులో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు రక్షిత మంచినీరు సరఫరా కోసం ప్రభుత్వం 440 వేల లీటర్ల కెపాసిటీతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో నిర్మించాలని గుత్తేదారున్ని ఆదేశించారు. ఈ పర్యటనలో మోదుకూరు సొసైటీ ఛైర్మన్ ఈదల వీర్రాజుచౌదరి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యుపిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపిఎఫ్) మూడవ ఆవిర్భావ దినోత్సవ వేడుక మంగళవారం స్థానిక ఇస్సాకు ఫౌండేషన్ ప్రార్ధనా శక్తి ఎస్టేట్‌లో ఘనంగా జరిగింది. యుపిఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నా మినిస్ట్రీస్ అధినేత రెవ. కారల్ డేవిడ్ కోమానపల్లి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇస్సాకు ఫౌండేషన్ అధినేత రెవ.చిక్కం ఇస్సాకు దైవ సందేశం అందించారు. చర్చ్‌ల నిర్మాణానికి అనుమతులు, క్రైస్తవులకు రాయితీలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రెండోసారి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యుపిఎఫ్ జిల్లా కార్యదర్శి రెవ.యెహోషువ, జిల్లా ఉపాధ్యక్షులు విక్టర్ నందా, తాతపూడి ఎర్నెస్ట్, భాస్కరరావు, గౌరవ అధ్యక్షులు చిక్కం దానియేలు, సంయుక్త కార్యదర్శి పిన్ని అబ్రహం, కోశాధికారి ఇమ్మానుయేలు ఆయా సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పలు వార్డులలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆర్‌టిసి డిపో ఎదురుగా ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధి కొరకు రూ.25 లక్షలను మున్సిపాలిటీ నుంచి కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.50 లక్షలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పట్టణంలో కుక్కల బెడద, అంటువ్యాధులు, ఇతర సమస్యలను పలువురు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు.ఈ సమావేశంలో కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కత్తి పద్మారావు పుట్టినరోజు

ప్రజాశక్తి - మామిడికుదురు

దళిత ఉద్యమనేత కత్తి పద్మారావు పుట్టిన రోజు వేడుకలను భూపతి వెంకటపతి అధ్యక్షతన మంగళవారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లి శ్రీనివాస్, కలిగితి పల్లంరాజు, బొంతు మణిరాజు, మట్టా సత్తిబాబు, పిల్లి శ్రీనివాస్, మోకాసత్యం, రొక్కం వేంకటేశ్వరావు, బత్తుల జనార్దనరావు, నల్లి శ్రీనుబాబు, విప్పర్తి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు: ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - మండపేట

సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని జెడ్.మేడపాడు పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షులుగా సలాది బాలసుబ్రమణ్యం, సభ్యులుగా సంగిశెట్టి అమ్మన్న, బోయిడి వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులకు సొసైటీ పాలకవర్గం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సొసైటీని అభివృద్ధి చేయాలని సూచించారు. కూటమి నాయకులు, రైతులు నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎఎంసి ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైస్ ఎంపిపి గజ్జరపు వెంకటరమణ, జడ్.మేడపాడు సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, సొసైటీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ఛైర్మన్‌ను అభినందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల